
కథ

# అక్షరం- ఆంతర్యం

**పత్రికలు, నవలలు అంటే పడి చచ్చే రకాన్ని నేను. (పడి చచ్చే అంటే అపార్థం చేసుకోకండే) ఈ కంప్యూటర్ యుగంలో టి.వి., వీడియోల మాయాజాలంలో చదువరులు పలచబడుతున్నా నేను మాత్రం పాత అలవాటు కొనసాగింపులోనే ఉన్నాను. అందుకే సాయంత్రం బస్‌స్టాప్‌లో నిల్చున్న నాకు ఎదురుగుండా బుక్‌స్టాల్‌లో వరుసగా వేలాడుతున్న 'సాహితి'పత్రిక లేటెస్ట్ కాపీలు కనువిందు చేశాయి. అంతే! గబగబా రోడ్డు దాటి వెళ్ళి మేగజైన్ కొని పేజీలు తిరగేశా.**



అంతలో ఒకపేజీ దగ్గర నా చూపులు నిలిచిపోయాయి. అది దీపావళి కథల పోటీలో 500 రూపాయల బహుమతి పొందిన కథ. రచయిత పేరు శ్రీకృష్ణ. బాక్స్ కట్టి ఫోటో కూడా వేశారు. అరె! కాలేజీ రోజుల్లో తన ఫ్రెండ్ శ్రీకృష్ణే. ఎంత మార్పు ఉన్నా ముఖ కవళికల నిట్టే పోల్చుకున్నా. సందేహంలేదు. ఆ కృష్ణే.

అంతలో బస్సెక్కాలన్న విషయం గుర్తొచ్చి రోడ్డు దాటాను. 'నాక్కావలసిన ఒ స్సెప్పుడూ నాకు వ్యతిరేక దిశలోనే ప్రయాణిస్తూ కన్పిస్తుంది' అనేది చాలాసార్లే అనిపించినా ఇవాళ మాత్రం నా బస్సు రావడమేకాదు. సీటు కూడా దొరికింది. ఇంకేం! పత్రిక మళ్ళీ తెరిచా. 'కృష్ణ రచయిత అయ్యాడా' స్వగతంగా అనుకుంటూ మళ్ళీ ఆ పేజీ తిప్పాను. కథ పేరు 'మా యింటికి రండి'. అందులో కథానాయకుడు కార్తీక్ ఆదర్శప్రాయుడైన భర్త. భార్యకు అన్నివిధాలా సహకరించే మనిషి. అప్పుడప్పుడు భార్య వారించినా కూడా అది తన విధి అంటూ ఎటువంటి తేడాల్లేకుండా అన్ని పనుల్లో 'ఓ చెయివేసేదా...' అంటూ ఆడుతూ, పాడుతూ సాయపడేరకం. అతణ్ణి చూసి అప్పటి దాకా పురుషాహంకారంతో చెలరేగిపోతున్న అతని కొలీగ్ శేఖరం కూడా మంచి భర్తగా మరిపోతాడు. అదీ కథ.

చదవటం పూర్తిచేసి 'అబ్బ! కాలేజీ రోజుల్లో ఆకతాయిగా ఉండే కృష్ణ ఎంతగా ఎదిగాడు! ఆదర్శవంతుడైన భర్త ఎలా ఉండాలో అంత బాగా రాశాడంటే నిజంగా ఎంత విశాల హృదయుడిగా మారి ఉంటాడో. ఏమైనా వాడి ఇల్లాలు అదృష్టవంతురాలు అనుకున్నా. ఇంటికెళ్ళి శిరి (మా ఆవిడ పేరు శిరీషలెండి)కి కూడా కథ చూపించా. చదివించా.

** ** **

ఇటీవల శ్రీకృష్ణ కథలు తరచు పత్రికల్లో అచ్చవుతున్నాయి. అన్ని కథల్లోనూ ఆదర్శాలు మా గోదారిలా పరవళ్ళు తొక్కుతున్నాయి. వాటిల్లో అతని పరిణతి చెందిన వ్యక్తిత్వాన్ని దర్శిస్తూ ఆనందిస్తున్నాను.ఆ పాత్రల చిత్రీకరణలు చూస్తే 'అందరూ ఇలా ఉంటే ఎంత బాగుండు' అనిపిస్తోంది. రెండు పత్రికల్లో శ్రీకృష్ణ రాసిన సీరియల్స్ కూడా వస్తున్నాయి. పాఠకులతో ముఖాముఖీ కూడా మొదలుపెట్టారు.

అది చూసేసరికి వాడికో ఉత్తరం రాయాలన్న ఆలోచన వెలిగింది. వెంటనే ఉత్తరం రాసి అందులో ఒకప్పటి మా స్నేహాన్ని గుర్తుచేశాను. పత్రికలో కాకుండా నాకు విడిగా ఉత్తరం రాయమంటూ నా అడ్రస్ రాశాను.

జె.శ్యామల

ఓ రెండు వారాల తర్వాత ఆఫీసులో పనిలో ఉండగా అటెండర్ వచ్చి 'మీకో పర్సనల్ లెటర్' అంటూ అందించాడు. చూస్తే అది శ్రీకృష్ణ దగ్గరనుంచి. ఎంతో ఆనందం... ఎంతో ఉత్సుకత. ఆత్రంగా ఉత్తరం తెరిచాను.

**డియర్ వాసూ!**

నీ లెటర్ చూసి ఆశ్చర్యపోయాను. నువ్వు విశాఖలో ఉన్నావని నాకు తెలీదు. లేకపోతే సాహితీ సభలకు వచ్చినప్పుడే మనం కలుసుకునేవాళ్ళం. రచయితనయ్యా కాబట్టి నీకు నేను గుర్తొచ్చానన్నమాట. కథలంటే నీకు ఇంత ఇంటరెస్ట్ ఉన్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. నువ్వు హైదరాబాద్ అల్లుణ్ణేనన్నావు కాబట్టి ఈసారి వచ్చినప్పుడు ఫ్యామిలీతో మా ఇంటికి తప్పకుండా రావాలి. కథొకటి పూర్తి చేయాల్సిన పని ఉంది. ఉంటామరి.

నీ మిత్రుడు
- శ్రీకృష్ణ

నేను ఉత్తరం చదవటంలో మునిగిపోవడం చూసి పక్క సీటు రాఘవ 'ఎక్కడినుంచేమిటి ఉత్తరం. అంతగా ఆలోచనలోపడిపోయారు' అడిగాడు. నేను కృష్ణ గురించి చెప్పేసరికి 'ఫేమస్ రైటర్ శ్రీకృష్ణ మీ ఫ్రెండా? అలాటి వాడు ఫ్రెండ్ కావటం నిజంగా గ్రేట్' అన్నాడు రాఘవ.

** ** **

మా బావమరిది పెళ్ళని శుభలేఖ వచ్చింది. దాంతోపాటు పది రోజులు ముందుగా రమ్మంటూ ఓ ఉత్తరం కూడా రాశారు మామగారు. అది చూసి మా శిరి ఉత్సాహం గేట్లు తెరిచిన నాగార్జునసాగరే అయింది. మూడురోజులపాటు షాపింగ్ చేసి పెళ్ళి ఓ వారంరోజులుందనగా రైలెక్కింది. కనీసం రెండురోజుల ముందయినా రమ్మని నన్ను ఆదేశించింది. నేను తలూపాను. రైలు కూత పెట్టింది. నేను వెనుదిరిగాను.

ఇల్లుచేరి. తాళం తీసి లోపలకు అడుగుపెట్టాను. శిరిలేని ఇల్లు వెలవెలబోతోంది. ఆరోజుకి శిరి వండిపెట్టింది కాబట్టి సమస్య లేదు. నాకు వంటరాదని కాదు గాని బద్ధకం జాస్తి. ఆ మర్నాడు సాయంత్రం నా ఒక్కడి కోసం వంట ఎందుకనిపించింది. కానీ హోటల్‌కి వెళ్ళే ఓపికలేదు. తప్పదనుకుంటూ అన్నం, టొమేటో చారుచేసి 'చాల్లే. అన్నింటి పెట్టు కమ్మ సున్ని ఉందిగా'అనుకున్నా.

టి.వి.చూస్తూ తిందామనుకునే సరికి మా టి.వి. రిపేరులో ఉందన్న విషయం గుర్తుకొచ్చింది. వెంటనే నా చూపు ఆ పక్కనే టేబుల్ మీదున్న మేగజైన్‌పై పడింది. వెంటనే దాన్ని అందుకుని చూస్తూ తినడం మొదలెట్టా. ఇలా చదువుకుంటూ తినడం నాకిష్టం. కానీ శిరి ఉంటే ఒప్పుకోదు. తినేటప్పుడు దృష్టి ఎక్కడో ఉంచకూడదంటుంది. ఇప్పుడు అవకాశం దొరికింది. నా దృష్టి మేగజైన్‌లో ఉన్న శ్రీకృష్ణ పేరు దగ్గర నిలిచిపోయింది. వెంటనే మెరుపులాంటి అయిడియా వచ్చింది. అవునూ. బావమరిది పెళ్ళికి హైదరాబాద్ వెళ్ళాలికదా. అప్పుడు కృష్ణని చూసివస్తే...' అనుకున్నాను.

చాలా ఏళ్ళ తర్వాత కృష్ణను. అందునా ఒక రచయితను కలుసుకోవడం, మాట్లాడటం ఊహించుకుంటే గొప్ప ఆనందంగా ఉంది. కమ్మసున్నికన్నా కమ్మగా తోచింది. ఆలోచనల్లోనే భోజనం పూర్తి చేశాను.

** ** **

మా బావమరిది పెళ్ళి బాగానే జరిగింది. హడావుడికాస్త సద్దుమణిగింది. వచ్చిన చుట్టాలు ఎవరికి వాళ్ళు సొంత ప్రోగ్రామ్‌లు ప్లాన్ చేసుకోవడం మొదలెట్టారు. శిరిని పిలిచి 'శిరీ! ఇవాళ ఆదివారమేకదా. కృష్ణా వాళ్ళింటికి వెళ్దాం. ఏమంటావు?' అడిగాను.

'దాన్దేముంది. వెళ్దాం. ముందుగా ఫోన్ చేయడం అదీ అవసరం లేదా?' అడిగింది శిరీ.

'అలా అనుకుంటే ముందే ఉత్తరం రాసేవాణ్ణి. సర్‌ప్రైజింగ్‌గా ఉండాలనే ఊరుకున్నా.అదీగాక ముందుగా తెలిస్తే వాళ్ళు లేనిపోని హడావుడి పడతారు' అన్నాను.

సరే! అయితే ఓ గంటలో బయల్దేరుదాం. మీరు స్నానం అదీ కానీండి' అంది శిరి.

అన్నట్లుగానే ఓ గంటలో రెడీ అయి యూసఫ్‌గూడాలో ఉన్న శ్రీకృష్ణ ఇంటికి బయలుదేరాం. పేరున్న రచయిత కాబట్టి ఇల్లు కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు. వెళ్ళి బెల్లు మోగించాం.

తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా ఒకామె. బహుశ కృష్ణ భార్య, మావంక ప్రశ్నార్థకంగా చూసింది.

'కృష్ణ..." అర్థోక్తిలో ఆగాను.

'ఆయనింకా లేవలేదు. లోపలికి రండి' అంటూ ఆహ్వానించింది. మేం డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాం. ఆమె కళ్ళలో మేం ఎవరమా?అన్న సందేహాన్ని అర్థంచేసుకొని-

'నేను కృష్ణ స్నేహితుణ్ణి. వైజాగ్‌లో ఉంటాం. ఇక్కడ మా బావమరిది పెళ్ళికి వచ్చాం. కృష్ణను ఒకసారి కలుసుకుందామని ఇలా...' అంటుండగానే ఏదో వింత శబ్దం వినిపించింది. చెవులు రిక్కించాను. అది ఒళ్ళు విరుచుకుంటున్న తీరని అర్థమయింది. వెంటనే 'జానీ!' అన్న పిలుపు వినిపించింది.

ఆమె కంగారుగా 'వస్తున్నానండీ' అంటూ పరుగులాంటి నడకతో వెళ్ళింది.

నేను, శిరి గోడలకు ఉన్న పెయింటింగ్స్‌ను పరిశీలించడం మొదలుపెట్టాం.

ఓ అయిదు నిముషాలు గడిచాయి. శ్రీకృష్ణ ఇటే వస్తున్నాడు. నేనెంతో ఆనందోద్రేకంతో లేచి నిలబడ్డాను. కానీ వాడు నింపాదిగా, చాలా క్యాజువల్‌గా, కాస్తంత గంభీరంగా కనిపించడంతో నా కాళ్ళకు అసంకల్పితంగానే బ్రేక్ పడింది.

'హలో! నువ్వా వాసూ! కూర్చో. వైజాగ్ నుంచి వచ్చారంటే ఎవరా అనుకున్నాను. వస్తున్నట్లు లెటర్ రాయొచ్చుగా" అన్నాడు కూర్చుంటూ.

'అలా రాస్తే థ్రిల్ ఉండదనిపించింది' కూర్చీలో కూలబడుతూ బదులిచ్చాను.

'థ్రిల్...' అంటూ అదోరకంగా నవ్వాడు.

ఎన్నో మాట్లాడాలనుకున్న నా నోరు పెగలనంటూ మొరాయిస్తోంది. వాడి తీరు నన్ను ఫ్రీగా ఉండనివ్వడం లేదు. ఏదో ఇరుకు... ఇబ్బంది...

'జానీ! కాఫీలు పట్రా!' అంటూ అరిచి. ఫోర్‌స్క్వేర్ వెలిగిస్తూ 'మీ మిసెస్‌ను పరిచయం చేయవా' అన్నాడు.

'ఆ..ఆ.. నా మిసెస్ శిరీష. నీకథలు తనుకూడా చదువుతుంది' అన్నాను.

ఇంతలో జానీ ఉరఫ్ జానకి కాఫీలు తెచ్చింది. ఆమెను చూపిస్తూ 'నా భార్య జానకి. రాగానే పరిచయమై పోయుంటుందిగా' అన్నాడు కాఫీ అందుకుంటూ.

'ఔ'నన్నట్లుగా తలూపుతూ చిర్నవ్వు నవ్వాను.

'వీడు కాలేజీ రోజుల నాటి ఫ్రెండ్... వాసు' జానకికి చెప్పాడు.

'నమస్తే' అందామె వినయంగా.

'నమస్తే అమ్మా' అంటూ పరిశీలనగా చూశాను. ఆమె బలహీనంగా ఉంది. కళ్ళలో నిద్రలేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఆమె వెనుదిరిగి లోపలికి వెళ్ళింది.

కృష్ణ తన రచనల గురించి. ఉద్యోగం గురించి చెప్పడం మొదలుపెట్టాడు. అందులో అంతా స్వోత్కర్షే. అంతలో లోపల పసిపిల్లాడి ఏడుపు వినిపించింది.

'జానీ! వాడి నోరు మూయించు. వెధవ లేస్తూనే ఏడుపందుకుంటాడు' చిరాకు పడ్డాడు కృష్ణ.

'పసిపిల్లలు...' శిరి సానుభూతిగా అంది.

'పిల్లాడు కాదమ్మా వాడు రాక్షసుడు' శిరితో అని, 'జానీ! ఎంతసేపూ ఆ వెధవ గురించేనా? మాకేమైనా టిఫిన్ ప్రయత్నం ఉందా, లేదా' మళ్ళీ పొలికేక పెట్టాడు.

'ఇప్పుడవన్నీ ఎందుకు...' అంటున్న నన్ను చేత్తో వారించాడు.

'వీడికి పాలుపట్టేసి పదినిముషాల్లో చేసేస్తా. ఈలోపు మీరు బ్రష్ చేసుకోండి. బాత్‌రూమ్‌లో అన్నీ రెడీగా పెట్టాను' అందామె శాంతంగా.

వాడు 'సరే, సరే' అని నావైపు తిరిగి 'బ్రష్ చేసుకుని వస్తాను. మీరు టి.వి. చూస్తూ ఉండండి' అంటూ లేచాడు.

నేనూ, శిరీ ముఖాలు చూసుకున్నాం. శిరి ముఖం కూడా అనీజీగానే ఉంది. అంతలో మళ్ళీ పిల్లవాడి ఏడుపు వినిపించింది.

'నేను లోపలకు వెళ్ళి ఆవిడకు సాయం చేయనా' అడిగింది శిరి.


'వెళ్ళు పాపం. బాబుతో అవస్థ పడుతున్నట్లుంది' అన్నాన్నేను.

శిరి లోపలకు వెళ్ళింది.

నేను అన్యమనస్కంగా టి.వి చూస్తుండగానే కృష్ణ రిఫ్రెష్ అయి వచ్చాడు. వెంటనే 'జానీ! టిఫిన్ రెడీనా' మళ్ళీ కేకేశాడు.

'ఆ...అవుతోంది కంగారుగా బదులిచ్చిందామె. ఇంతలో

పూర్వ కాలంలో అల్లసాని పెద్దన. శ్రీనాథుడు వాళ్ళను చూడు. ఎంత విలాసంగా జీవిస్తూ కావ్య రచన చేశారో అదలా ఉంచి ఒక రచయిత భర్త కావడం మా జానీకి మాత్రం గర్వకారణం కాదూ. అయినా నీకర్థం కాదులే అన్నాడు నన్నే అమాయకుడిగా జమకట్టి



శిరి బాబునెత్తుకు వచ్చింది.

'అరె వాడి డ్యూటీ మీరు తీసుకున్నారా? మీ చీర ఖరాబు చేస్తాడు. జానీ ఏంచేస్తోంది' చిరాగ్గా అన్నాడతను.

'టిఫిన్ తయారుచేస్తున్నారు. బాబు ఏడుస్తాడని నేను తీసుకున్నాను. ముద్దుగా ఉన్నాడు. ఏంపేరు' చొరవగా అంది శిరి.

'అభిమన్యు. వాడికి పదిమంది సేవకులున్నా సరిపోరు. అందులో జానీకి అసలేం చేతకాదు' చిరాకుపడ్డాడు.

'ఏంచేతకాదు?' అని అడగాలనుకుని, బాగోదని ఊరుకున్నా. బాబు నావైపు దూకుతుంటే శిరి చేతిలోనుంచి నేనందుకున్నాను. వెంటనే వాడు నాకు అభిషేక సత్కారం చేసేశాడు. శిరి నవ్వేసింది. నేనూ నవ్వబోతుండగా 'జానీ! ఈవెధవ చూడు... ఏం నిర్వాకం చేశాడో' అరిచాడు కృష్ణ.

ఆమె పరుగునవచ్చి వాడినందుకుని 'సారీ అండీ. నాప్‌కిన్ తెచ్చిస్తాను' అంది.

'టిఫిన్‌కి ఇంకా ఎన్ని యుగాలు పడుతుంది' గద్దించినట్లు అన్నాడు కృష్ణ.

'ప్లేట్లలో పెట్టాను. ఇంతలో మీరు పిలిస్తే ఇటొచ్చాను' అందామె.

'ఊ కానీ... కానీ' అన్నాడు కృష్ణ.

ఆమె వాణ్ణి ఉయ్యాల్లో పడుకోబెట్టి వచ్చి నాకు నాప్‌కిన్ అందించింది.

నేను అందుకుని నా షర్ట్ తుడుచుకున్నాను. అంతలో ఆమె అందరికీ దోశెలు పట్టుకొచ్చింది.

కృష్ణ 'తీసుకోండి' అంటూ చట్నీకేసి చూసి 'కూర చేయలేదా?' భార్యనడిగాడు.

'లేటవుతుందని చేయలేదు' మెల్లగా అందామె.

'ఈ చట్నీ బోర్' సణుగుతూనే తిన్నాడు కృష్ణ.

టిఫిన్ కాగానే 'జానీ! ఇంకో రౌండ్ స్ట్రాంగ్ కాఫీ పట్టుకురా' అన్నాడు.

తలూపుతూ లోపలికి వెళ్ళిందామె.

ఆమెను మా ఎదురుగా గద్దిస్తూ, ఆర్డరు చేయడం మాకెంతో ఇబ్బందిగా ఉంది. ఆమె మళ్ళీ కాఫీలు తెచ్చింది. శిరి తనకు ఎక్కువసార్లు అలవాటు లేదని ముందే చెప్పింది. నేను కూడా వద్దంటే కృష్ణ ఏమనుకుంటాడో అని ఊరుకున్నాను.

లోపల బాబు ఏడుస్తున్నాడు. ఆమె వాడిని సముదాయిస్తోంది. 'నా లిటరరీ ప్రోగ్రామ్స్ తాలూకు క్యాసెట్స్ చూస్తారా? భోజనం చేసి మధ్యాహ్నం తాపీగా వెళ్ళొచ్చు' అన్నాడు కృష్ణ.

మాకు భోజనాలవేమీవద్దు. ఇప్పుడే కదా టిఫిన్ తిన్నాం. మా మామగారు అక్కడ మేం వెళ్ళేదాకా భోజనం చేయడు. మరోసారి తీరిగ్గా వస్తాంలే' అని చెప్పి 'ఓమాట అడుగుతాను. ఏమీ అనుకోవుగా' అన్నాను. మా శిరి వారింపు చూపులను కూడా లెక్కచేయకుండా.

'ఏమిటది? అడుగు. రచయితను కదా. జవాబులివ్వడం నాకు మామూలే' ఒకింత గర్వం ఒలికించాడు.

'ఏంలేదు. నువ్వు రాసే కథలన్నింటిలో భర్త, భార్యకు అన్ని పనుల్లో చేదోడు, వాదోడుగా ఉండాలని రాస్తుంటావుకదా. మరి అందుకు భిన్నంగా నువ్వు...' అర్థోక్తిలో ఆగాను.

'అదా!' అంటూ పెద్దగా నవ్వి ఒక నిముషం ఆగి 'చూడు వాసూ! నేను అందరిలాంటి మామూలు మనిషిని కాను. రచయితను. నేను పనికిమాలిన పనులన్నీ చేస్తూ జానీతోపాటే తిరిగితే నా రచనా వ్యాసంగం అయినట్టే. రచయిత అనేవాడికిలాంటి డిస్టర్బెన్స్‌లేం ఉండకూడదు. ఇంటిపనులు, పిల్లవాడి ఏడుపు, జలుబు, జ్వరము, డాక్టరు చుట్టూ తిరగడం... ఓహ్! ఇవన్నీ చెడ్డ న్యూసెన్స్. నేను రచనలు చేయాలంటే ఎంత పరిశీలించాలి, ఎంత ఆలోచించాలి? పూర్వ కాలంలో అల్లసాని పెద్దన. శ్రీనాథుడు వాళ్ళను చూడు. ఎంత విలాసంగా జీవిస్తూ కావ్య రచన చేశారో అదలా ఉంచి ఒక రచయిత భర్త కావడం మా జానీకి మాత్రం గర్వకారణం కాదూ. అయినా నీకర్థం కాదులే' అన్నాడు నన్నే అమాయకుడిగా జమకట్టి.

ఇంక లాభంలేదనుకుని 'ఇంక మేం వస్తాం' అన్నాను. వాడు 'జానీ! వాసు వెళతానంటున్నాడు' మళ్ళీ ఓ పొలికేక పెట్టాడు.

'వస్తున్నానండీ' అంటూ ఆమె బాబునెత్తుకొని వచ్చింది. శిరికి బొట్టుపెడుతూ 'భోజనం చేసి వెళ్ళొచ్చుకదా, ఏం తొందర' అంది.

'ఇంకోసారి వస్తాంగా. మీరు వైజాగ్ వస్తే మా యింటికి రండి' అంది శిరి.

ఆమె నిర్లిప్తంగా నవ్వింది.

శ్రీకృష్ణ ఓ పుస్తకం అందిస్తూ, ఇదిగో నా కొత్త నవల 'పూవు- తావి'. చదివి ఎలా ఉందో రాయి' అని నాతో అని 'నువ్వుకూడా చదువమ్మా' అన్నాడు శిరినుద్దేశించి.

నేను 'థ్యాంక్యూ' అంటూ వాడితో చేతులు కలిపి 'వస్తాం' అంటూ సెలవు తీసుకున్నాను. నాలో ఆలోచన-

'వచ్చేటప్పుడు ఎంత ఉత్సాహం. ఇప్పుడు నిరుత్సాహం. అక్షరాలకు, ఆంతర్యానికి ఏమాత్రం పొంతనలేని కృష్ణను తలచుకుంటే జుగుప్సగా ఉంది. పాపం ఆమె! రచయిత భార్య. ఛీ!